క్లుప్తంగా

ఎమ్మెల్యే అభ్యర్థిగా జంగారెడ్డి దరఖాస్తు

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ పార్టీ నుంచి మండలంలోని దెబ్బడగూడకు చెందిన పీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి దరఖాస్తు చేశాడు. బుధవారం గాంధీభవన్‌కు పార్టీ నాయకులతో వెళ్లి దరఖాస్తు అందజేశాడు. తనకు ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణ నాయక్, పీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు సరికొండ మల్లేష్, నాయకులు పరమేష్, మదన్‌పాల్‌రెడ్డి, జగదీశ్వర్, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌కు పితృవియోగం


విక్రంరెడ్డిని పరామర్శిస్తున్న సబితారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి తండ్రి, సర్పంచ్ తీగల సత్యనారాయణరెడ్డి (80) బుధవారం తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి సత్యనారాయణరెడ్డి మృతికి సంతాపం తెలిపి భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మంత్రి సానుభూతి తెలిపి అంత్యక్రియలలో పాల్గొన్నారు. నివాళులు అర్పించిన వారిలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మీర్‌పేట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, స్థానిక నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నూతన సబ్ రిజిస్ట్రార్‌గా మధుసూదన్‌రెడ్డి


మహేశ్వరం: మహేశ్వరం సబ్‌రిజిస్ట్రార్ అధికారిగా మధుసూదన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన మహేందర్ కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. మధుసూదన్‌రెడ్డి చంపాపేట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేసి బదిలీపై మహేశ్వరం వచ్చారు. నిబంధనల ప్రకారం ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసి పారదర్శకంగా పని చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ అనిల్, జూనియర్ అసిస్టెంట్ గోపి, సాయి, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ నేతల సంబురాలు


బడంగ్‌పేటలో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

బడంగ్‌పేట్: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో బడంగ్‌పేట చౌరస్తాలో బుధవారం బీజేపీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. జాతీయ జెండాను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచంలోనే చరిత్ర సృష్టించిందన్నారు. దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ కాలు మోపి మీసం మెలేసిందని ఆనంద వ్యక్తం చేశారు. చంద్రయాన్–3 చందమామను ముద్దాడి అంతరిక్షంలో భారత ప్రతిష్టను మరింత పెంచిందని తెలిపారు. నేటి నుంచి 14 రోజుల పాటు జాబిల్లిపై రోవర్ పరిశోధనలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, మల్లారెడ్డి, రాంరెడ్డి, యాదగిరి, బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్, లోకం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించే అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. పూజారి శ్రీనివాసశర్మ నేతృత్వంలో సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డిలు భూమిపూజ చేశారు. దాతల సహకారంతో రూ.50 లక్షలతో అయ్యప్పదేవాలయం నిర్మిస్తున్నట్లు సర్పంచ్ అనురాధ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, వెంకటేశ్, శ్రీశైలం, శేఖర్, యాదయ్య పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు

ఆమనగల్లు: పట్టణానికి చెందిన పలువురు బీజేపీ నాయకులను బుధవారం ఆమనగల్లు పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విఫలమయ్యారని,బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, కౌన్సిలర్ లక్ష్మణ్, నర్సింహ, వెంకటయ్యలను పోలీసులు అరెస్టు చేసి సాయంత్రానికి విడిచిపెట్టారు.

చకచకా నిర్మించ‘బడి’

రూ.5 కోట్లతో దావుత్‌ఖాన్‌గూడలో హైస్కూల్ నిర్మాణం


నిర్మాణంలో మోడ్రన్ హైస్కూల్ భవనం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని దావుత్‌ఖాన్‌గూడలో అత్యాధునిక మోడ్రన్ హైస్కూల్ నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఈ భవనం పూర్తయితే జిల్లాలోనే టాప్ కార్పొరేట్ స్కూల్ భవనాలల్లో ఈ స్కూల్ నిల్వనుందని విద్యాశాఖ పేర్కొంది. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని దావుత్‌ఖాన్‌గూడలో సర్వేనంబర్–2 మూడు ఎకరాల విస్తీర్ణంలో కొత్త హైస్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. పాత గ్రామ పంచాయతీ చౌరస్తాలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రోడ్డు విస్తరణలో క్రీడా ప్రాంగణమంతా పోయింది. సరైన గదులు ఉన్నప్పటికీ ఇరుకుగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు పాఠశాలకు వచ్చిన మంత్రి సబితారెడ్డిని ఇక్కడి నుంచి పాఠశాలను తరలించాలని కోరడంతో కొత్త పాఠశాల నిర్మాణానికి అనుమతులు తీసుకుని స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికి రెండు స్లాబులు పడ్డాయి. మూడో స్లాబుకు పనులు జరుగుతున్నాయి. ఈ స్కూల్‌ను నిబంధనల ప్రకారం యూ ఆకారంలో నిర్మిస్తున్నారు.

సిద్ధంగా ఉంచిన సామగ్రి

మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా కొత్తగా నిర్మాణం చేయబోతున్న పాఠశాలకు చాక్ పీస్‌లతో అవసరం లేకుండా ఈ టెక్నాలజీతో కూడిన బోర్డులను, కార్పొరేట్ స్కూళ్లలో వాడే బెంచీలు, కుర్చీలు, మోడ్రన్ టాయిలెట్లు, సైన్స్, మాథ్స్, బయోసైన్స్, సోషల్ ల్యాబ్‌రేటరీల సామగ్రిని అప్పుడే అందుబాటులోకి తెచ్చారు. భవన నిర్మాణాన్ని ఒక ఎకరాస్థలంలో నిర్మిస్తున్నారు. మిగతా రెండు ఎకరాలు ఆట స్థలానికి వదిలిపెట్టారు. మైదానానికి స్థలం కేటాయించడంతో విద్యా మేధావులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు చదువుతో పాటు శరీరక శ్రమ (ఆటలు) చాలా అవసరం అని భావిస్తున్నారు. పేద మధ్యతరగతి పిల్లలు చదువుకునేందుకు మోడరన్ స్కూళ్లు ఈ జనరేషన్ కాలంలో నిర్మించడానికి విద్యాశాఖమంత్రిగా సబితారెడ్డి పూనుకోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

“ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్



బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ రోజురోజుకు విస్తరిస్తోంది. జనాభా రెట్టింపు అవుతుంది. పేదలు పిల్లలను సర్కారి స్కూళ్లకు పంపిస్తున్నారు. కానీ, మధ్య తరగతి ప్రజలు నామూచీకి పోయి అప్పులు చేసి పిల్లల్ని ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారు. ఈ విషయంపై స్టడీ చేశాను. పేదలు, మిడిల్‌క్లాస్ ప్రజలకే కాకుండా కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ఏర్పాటు చేయాలని అనుకున్నా. స్కూల్ కట్టించమని ఎవరూ అడగకున్నా, ఈ డ్రీమ్ ప్రాజెక్ట్‌ను విద్యార్థుల భవిష్యత్తు కోసం నేనే మొదలు పెట్టా. ఇది జిల్లాలోనే రోల్ మాడల్‌గా తీర్చిదిద్దబోతున్నాం. ఆరు నెలల్లో పూర్తి చేస్తాం. మధ్య తరగతి, ఉన్నత విద్యావంతులు, ఉన్నత ఫ్యామిలీ పిల్లలు ఇందులో ధైర్యంగా చదివించేలా ఏర్పాటు చేస్తున్నాం.

– సబితారెడ్డి, విద్యాశాఖమంత్రి

భౌ భౌలతో భయం..భయం!

- కాలనీల్లో వీధి కుక్కల స్వైరవిహారం
- పాదచారులపై దాడులు
- ఆందోళనకు గురవుతున్న స్థానికులు


అంబేద్కర్‌నగర్‌లో తిరుగుతున్న కుక్కల గుంపు

దిల్‌సుఖ్‌నగర్: వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సాయంత్రం అయిందంటే చాలు రోడ్లపై తిరుగుతూ పాదచారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఆర్‌కేపురంలోని ఎన్‌టీఆర్‌నగర్, మార్గదర్శికాలనీ, మల్లికార్జుననగర్, సరూర్‌నగర్‌లోని అంబేద్కర్‌నగర్ తదితర కాలనీలలో కుక్కల బెడదతో చిన్న పిల్లలు సాయంత్రం వేళ ఆరుబయట ఆడుకోవాలంటేనే భయపడుతున్నారు. కుక్కలు రాత్రి సమయాల్లో పెద్దగా అరుస్తూ కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయని కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లోని గ్రామసింహాలను వేరే ప్రాంతాలకు తరలించి వాటి బారినుంచి తమను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

వేరే ప్రాంతాలకు కుక్కలను తరలించాలి

ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే వీధి కుక్కలు ఎక్కడి నుంచి వచ్చి దాడి చేస్తాయోనని కాలనీలవాసులు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. వీధికుక్కలను తరలించేలా అధికారులు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలి.

– మహేష్, ఎన్‌టీఆర్‌నగర్

వీధికుక్కలతో భయాందోళనలు

చీకటి పడిందంటే వీధి కుక్కలతో ఇబ్బందిగా ఉంది. మేము నగరంలోని వేరే ప్రాంతంలో పని చేసి ఇంటికి వచ్చేసరికి రాత్రి అవుతుంది. ఆ సమయంలో కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయోనని భయాందోళనకు గురవుతున్నాం. అధికారులు స్పందించి వెంటనే వీధి కుక్కలను ఇక్కడి నుంచి తరలించాలి.

– యాదయ్య, అంబేద్కర్‌నగర్

బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవాలి

పార్టీ ఎమ్మెల్యే రవి సుబ్రహ్మణ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవి సుబ్రహ్మణ్యం

మీర్‌పేట: ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండి బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని బెంగళూరు టౌన్ ఎమ్మెల్యే రవి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా బుధవారం మీర్‌పేటలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కార్యకర్తల్లోకి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, నియోజకవర్గాల్లో అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని అన్నారు. మీర్‌పేట బీజేపీ అధ్యక్షులు పెండ్యాల నర్సింహ్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఫ్లోర్‌లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సుధాకర్‌శర్మ, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి దేవేందర్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాతగౌడ్, కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బాలేష్‌చారి

బడంగ్‌పేట్: మంత్రి సబితారెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్ఎస్ బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీసీసెల్ ఉపాధ్యక్షుడు ఈశ్వరోజు బాలేష్‌చారి అన్నారు. బుధవారం మంత్రి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సబితారెడ్డి సహకారంతో మహేశ్వరం నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి చేశారని అన్నారు. సీఎం కేసీఆర్ బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయించి మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తున్నారని గుర్తు చేశారు. బీసీల పూర్తి మద్దతుతో సబితారెడ్డిని భారీ మెజార్టీతో మరోమారు గెలిపించుకుంటామన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మంత్రి సబితారెడ్డి పేరును సీఎం కేసీఆర్ ప్రకటించడాన్ని స్వాగతిస్తూ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం పార్టీ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ దీక్షిత్‌రెడ్డి, బీసీ సెల్ మండల ప్రధానకార్యదర్శి ప్రశాంత్‌చారి, యూత్ నాయకుడు గణేష్ పాల్గొన్నారు.


బడంగ్‌పేట్: మంత్రి సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బాలేష్‌చారి


కందుకూరు: మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు

వైశ్య వికాస వేదిక చైర్మన్ సత్యనారాయణ గుప్తా


ఆర్థిక సాయం అందజేస్తున్న సత్యనారాయణ గుప్తా

హుడాకాంప్లెక్స్: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ,గౌరవం ఉంటుందని వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. షాద్‌నగర్ వైశ్య కుటుంబానికి చెందిన శ్రీనివాస్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల పిల్లల్ని చదివించలేకపోతున్నాడు. విషయం తెలుసుకున్న కాచం సత్యనారాయణ గుప్తా శ్రీనివాస్ కూతురు మౌనిక ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫీజు గాను పదివేల రూపాయలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికంతో ఎవరు చదువును మధ్యలో ఆపేయొద్దనే ఉద్దేశంతో విద్యార్థిని చదువు కోసం ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థిని ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గాను 459 మార్కులు సాధించిందని తెలిపారు. వైశ్య వికాస వేదిక నుంచి ఎంతో మంది పేద విద్యార్థిని, విద్యార్థుల చదువు కోసం ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని, భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి రమేష్ గుప్త, రాంబాబు గుప్త, కాపర్తి ప్రకాష్ గుప్త పాల్గొన్నారు.

మాడ్గులలో ‘ప్రవాస్ అభియాన్’

ఆమనగల్లు: మాడ్గుల మండలంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రవాస్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వచ్చిన కర్నాటక రాష్ట్రం మంగళూర్ నార్త్ ఎమ్మెల్యే డా.భరత్‌శెట్టి , మండలానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. పార్టీ విజయం కోసం కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కమలేశ్, వెంకటేశ్, వెంకట్‌రెడ్డి, శంకర్, వెంకటేశ్ గౌడ్ పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఆమనగల్లు: పత్తిపంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో బుధవారం ఆమె రైతులు సాగుచేసిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ.. వరిలో కాండం తొలచు పురుగు నివారణకు పటేరా గుళికలను 4 కిలోల ఇసుకలో కలిపి చల్లాలని సూచించారు. పత్తిపంటలో పోషకలోపాల నివారణకు ఫార్ములా 4 ఎకరానికి 400 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు మల్లయ్య, జంగయ్య, పెద్ద మల్లయ్య హనుమంతు, పూల్య, రవీందర్ పాల్గొన్నారు.

పరమేశ్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం: డాక్టరేట్ గ్రహీత, ఇబ్రహీంపట్నం పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పి. పరమేశ్‌ను బుధవారం ఉపాధ్యాయులు సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరమేశ్‌ను ఉపాధ్యాయులు శాలువ కప్పి, మెమెంటోను అందజేసి సత్కారించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణాదేవి, దమయంతి, స్వర్ణలత, సుప్రియ, గిరిజ, శ్రీలత, జ్యోతిలు పాల్గొన్నారు.

నవోదయకు దరఖాస్తు చేసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: నవోదయ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడానికి దరఖాస్తు చేసుకోవాలని పీఆర్టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్ తెలిపారు. బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 11 మందికి నవోదయ అప్లికేషన్ ఫారాలు పూర్తి చేసి ఇచ్చారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పీఎస్, యూపీఎస్, హెచ్ఎంఎస్, టీచర్ల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులతో దరఖాస్తుకు ప్రోత్సహించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న గోపాల్‌యాదవ్

పహాడీషరీఫ్: పేదల పాలిట సంజీవనిలా సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉందని మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బండారి గోపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మామిడిపల్లికి చెందిన ఈసంపల్లి అంజయ్య భార్య అండాలు అనారోగ్యానికి గురై చికిత్స పొందడంతో కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించగా, మంత్రి సబితా ఇంద్రారెడ్డి సిఫార్సు మేరకు రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబ సభ్యులు మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు యాతం బాల్‌రాజ్ యాదవ్, కిరణ్‌కుమార్ ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, శంకర్, శ్రీశైలం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం భూదందా చేస్తోంది

మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఎలాంటి రుసుం వసూలు చేయకుండా కర్మన్‌ఘాట్‌లోని పేదల భూములను రెగ్యులరైజ్ చేశారని, అదే విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా పేదల భూములను రెగ్యులరైజ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి కోరారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎప్పుడూ ఓట్లు, డబ్బుల దండుకోవాలనే ఆలోచన తప్ప.. ప్రజలకు మేలు చేయాలనే సోయ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు తాము కృషి చేస్తామన్నారు. 58,59 జీఓ ద్వారా పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను సైతం ఈ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటోందని, ఇళ్లు కట్టుకోకుండా ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ భూ దందా చేస్తోందని బీఆర్ఎస్ సర్కార్‌పై రాంరెడ్డి ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ఎల్‌బీనగర్ ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను అధిక మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.10 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్ఎన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు నర్సింహ, వార్డు సభ్యులు నరేందర్, మల్లయ్య, భిక్షపతి, గణేశ్, ఎట్టమ్మ, నాయకులు యాదగిరిరెడ్డి, అశోక్, రాంచంద్రయ్య, రాంచందర్ నాయక్, మంకి శ్రీను, వెంకటయ్యగౌడ్, శ్రీను పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ..

కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ప్రకటించడంతో మండలంలోని గౌడ, వీరశైవ, కురుమ, రజక, మహారాజు, ముదిరాజ్, నాయీబ్రహ్మణ కుల సంఘాల ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

రాజ్యాధికారంతోనే ముదిరాజ్‌ల బతుకులు బాగు


ధ్రువపత్రాలు అందజేస్తున్న యాదగిరి, సంఘం నాయకులు

ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు యాదగిరి

తలకొండపల్లి: రాజ్యాధికారంతోనే ముదిరాజ్‌ల బతుకులు బాగుపడతాయని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి పేర్కొన్నారు. అందరు ఐక్యమత్యంతో రాజ్యాధికారం కోసం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బుధవారం మండలంలోని దేవునిపడకల్‌లో ఆ సంఘం మండలాధ్యక్షుడు యాదగిరి సమక్షంలో గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ నూతన అధ్యక్షుడిగా రామస్వామి, గౌరవ అధ్యక్షుడిగా జంగయ్య, ఉపాధ్యక్షుడిగా రఘు, స్వామి, రామస్వామి, రాములు, యాదయ్య, జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా నరసింహ, కార్యదర్శులుగా మల్లేష్, మహేష్, శ్రీశైలం, సలహాదారులుగా ఆంజనేయులు, కార్యదర్శులుగా వెంకటేష్, కార్తీక్, శ్రీను, రాము, విక్రమ్, హరికృష్ణ, శ్రీను, శ్రీశైలంతో పాటు, మరో 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... ముదిరాజ్‌ల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి వారి ప్రగతికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఉపాధి, తదితర రంగాల్లో వెనుకబడి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్‌ల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులకు అండగా బీఆర్ఎస్

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


విశ్వకర్మ భవన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తుర్కయంజాల్: వెస్ట్ హైదరాబాద్‌ను తలదన్నేలా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి చెందనుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 19వ వార్డులో నూతనంగా నిర్మించిన విశ్వకర్మ భవన్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే, అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని కులవృత్తుల వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎల్లప్పుడు ప్రజల అభివృద్ధిని కాంక్షించే బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. అనంతరం 100 మంది విశ్వబ్రాహ్మణులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలను కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. బ్రాహ్మణపల్లిలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి క్యాడర్‌ను ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, కౌన్సిలర్లు కవిత, శ్రీశైలం, బ్యాంకు డైరెక్టర్ స్వప్న శ్రీనివాస్ పాల్గొన్నారు.